క్లుప్తంగా...

ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న శ్రీ గణేష్

రసూల్‌పురా: ఆషాఢమాసం మొదటి ఆదివారం పురస్కరించుకుని కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ, టైగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాభిషేకం, 108 కలశాలతో పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్, రంగా రవీందర్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంకుమార్, బల్వంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వార్డు మహిళ అధ్యక్షురాలు నాగినేని సరిత హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీ గణేష్ వారిని ఘనంగా సన్మానించారు.

రాజేశ్వర్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సైన్స్ కాలేజీ భూగర్భ శాస్త్రంలో ఎస్.రాజేశ్వర్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. సీనియర్ అధ్యాపకులు ప్రొ.పాండు రంగారెడ్డి పర్యవేక్షణలో హైడ్రోలాజికల్ స్టడీస్ ఆఫ్ మల్లేపల్లి ఏరియా ములుగు మండల్, వరంగల్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

శాంతినగర్‌లో ఇంటింటికీ బీజేపీ

లాలాపేట: తెలంగాణలో సుపరిపాలన కావాలంటే అది బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకురాలు బండా కార్తీకరెడ్డి అన్నారు. శాంతినగర్‌లో బూత్ అధ్యక్షులు టెంపుల్ సాయి అధ్యక్షతన జరిగిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో కార్తీకరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి,బండ శివారెడ్డి,వీరన్న, అనిత, రామ్ వర్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సికింద్రాబాద్: తెలంగాణ ఆవిర్భావం తర్వాత సికింద్రాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్‌లో పంపిణీ చేశారు. టీఆర్ఎస్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ రూపొందించిన కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తనయుడు యువ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాల కాలంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి పనులు గడచిన ఏడేళ్లలో పద్మారావుగౌడ్ నేతృత్వంలో జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, నవీన్‌చారి, రాజు, నవీన్‌గౌడ్, అనిత, అరుణ, అర్చన, పవిత్రగౌడ్, పింకిసింగ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం



బాధితులను పరామర్శిస్తున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ఇందిరానగర్‌లో ఆదివారం ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సమాచారం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్‌తో మాట్లాడి ఆస్తి నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ బాధితులకు భరోసా కల్పించారు.

కౌశిక్‌రెడ్డిపై ఎస్ఆర్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు

అమీర్‌పేట: ముదిరాజ్ కులస్తులను అవమానపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగ పుత్రులు, ముదిరాజ్‌ల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అజేయ్ ముదిరాజ్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు.

ఆటాడుకుందాం రండి..!



- శ్రీనివాసనగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు గ్రీన్‌సిగ్నల్
- మూడున్నర కోట్లతో మూడంతస్తుల్లో నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు, యువత

చిలకలగూడ : అంతరాయం లేకుండా ఆటలాడుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని జీహెచ్ఎంసీకి చెందిన ఖాళీ స్థలంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. స్థానిక కార్పొరేటర్ సామల హేమ అభ్యర్థన మేరకు నిధులు సమకూర్చేందుకు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అంగీకరించారు. జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ విభాగ అధికారులు, ఇంజినీర్ల బృందం ఇటీవల స్థల పరిశీలన పూర్తిచేసి ప్రతిపాదనల బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తున్నారు. సుమారు మూడున్నర కోట్ల రూపాయల వ్యయంతో మూడు అంతస్తుల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఆమోదం పొందిన వెంటనే నిర్మాణ పనులు చేపడతామని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.

మైదానాలు ఇబ్బందులు..

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ఆటలాడుకునేందుకు సరైన క్రీడ మైదానాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, యువత, చిన్నారులు క్రీడలపై ఆసక్తి చూపించడంలేదు. కంప్యూటర్లు, ఐపాడ్, సెల్‌ఫోన్లలో గంటల తరబడి గేమ్స్ ఆడడంతో పలు రకాల రుగ్మతలతోపాటు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిరోజు సుమారు రెండు గంటల పాటు ఆసక్తి ఉన్న క్రీడల్లో పాల్గొనాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ పద్మారావు క్రీడల మంత్రిగా ఉన్నప్పుడు క్రీడా మైదానాల అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. లాలాపేట జయశంకర్ స్టేడియంలో పలు రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ చిలకలగూడ, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, పద్మారావునగర్, వారాసిగూడ, బౌద్ధనగర్, మైలార్‌గడ్డ తదితర ప్రాంతాలకు చెందినవారికి అందుబాటులో లేకపోవడంతో ఎట్టిపరిస్థితుల్లోనూ శ్రీనివాసనగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని పద్మారావు కంకణం కట్టుకున్నారు.



ముషీరాబాద్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు(ఫైల్)

ఒకే ప్రాంగణంలో నాలుగు రకాల సౌకర్యాలు..

శ్రీనివాసనగర్‌లో అందుబాటులో ఉన్న 1200 గజాల స్థలంలో ఒకే చోట నాలుగు రకాల సౌకర్యాలు కల్పించనున్నారు. 800 గజాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతారు. చుట్టూ వాకింగ్ ట్రాక్, పచ్చందాలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో చిలకలగూడ యుపీహెచ్‌సీ భవనం, పార్కింగ్‌కు కేటాయిస్తారు. మొదటి అంతస్తులో కమ్యూనిటీ హాల్, రెండో అంతస్తుల్లో టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, బిలియర్డ్స్ టేబుల్స్‌తోపాటు టాయిలెట్లు, చేంజింగ్ రూమ్‌లు, మూడో అంతస్తులో షటిల్ బాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్‌లో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనాన్ని ఇటీవల పరిశీలించి అదే తరహా ఇక్కడ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



నిధుల కేటాయింపు అనుమతి పత్రాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఇస్తున్న సామల హేమ(ఫైల్)

నిధుల కొరత రానివ్వను..

సంబంధిత అధికారులు రూపొందించిన బ్లూ ప్రింట్ ఆమోదం పొందిన వెంటనే శ్రీనివాస నగర్‌లో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడుతాం. ఎన్ని కోట్ల రూపాయల నిధులైనా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాం. క్రీడలపై మక్కువ కలిగించేలా యువత, చిన్నారులు, విద్యార్థులను ప్రోత్సాహించాలి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడ్డంకులు సృష్టించొద్దు.

–డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. శనివారం కురిసిన భారీ వర్షం కారణంగా ముంపు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. వర్షం కారణంగా ఎల్ఎన్‌నగర్, గోల్లపుల్లయ్య బావి, అశోక్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. పలు బస్తీలలో తలెత్తిన డ్రైనేజీ సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు సూచించామని వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ..

వృద్ధులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు.ఆదివారం జామైఉస్మానియా ప్రాంతంలో ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్‌లోని సుమారు 30కి ఆమె దుప్పట్లు, భోజనం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

జర్నలిస్ట్ తులసి చందును బెదిరించడం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: స్వతంత్ర జర్నలిస్ట్ తులసి చందును బీజేపీ నాయకులు చంపుతామని బెదిరించడం సరికాదని ఓయూ విద్యార్థి నేతలు పేర్కొన్నారు. ఆదివారం దళిత బహుజన, వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు తులసి చందుకు మద్దతుగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. దేశంలో బీజేపీ చేస్తున్న మత రాజకీయాలు, మోసాలను నిర్భయంగా ప్రచారం చేస్తున్న తులసి చందును చంపుతామని సోషల్ మీడియాలో బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆమెకు ఏమైనా జరిగితే బీజేపీ నాయకులదే బాధ్యత అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వేల్పుల సంజయ్, తిరుపతి, వేణుగోపాల్, జంగిలి దర్శన్, మున్నా, రెహమాన్, వలిగొండ నర్సింహ, సుమంత్, అజయ్, శ్రీకాంత్‌యాదవ్, సతీష్ పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థి నాయకులు

జూలై 1న ఖబ్రస్తాన్ పనులు ప్రారంభిస్తాం

సనత్‌నగర్: వచ్చేనెల 1వ తేదీన ఓల్డ్ కస్టమ్స్‌లోని ముస్లిం గ్రేవ్‌యార్డు పనులు ప్రారంభిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని తన నివాసంలో బేగంపేటకు చెందిన ముస్లిం ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఖబ్రస్తాన్ నమూనాను జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.3 కోట్ల వ్యయంతో గ్రేవ్ యార్డును నిర్మిస్తామని, అదనంగా నిధులు అవసరమైతే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రేవ్‌యార్డు లేక తాము ఎన్నో ఇబ్బందులు పడ్డామని, అనేక సందర్భాల్లో మృతదేహాలను ఎక్కడ ఖననం చేయాలో తెలియని అయోమయ పరిస్థితికి గురయ్యామని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తులు కూడా తమ సమస్యను పరిష్కరించలేదని ఆయన దృష్టికి తెచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఓల్డ్ కస్టమ్స్‌లో రెండెకరాల భూమిని ఖబ్రస్తాన్‌కు కేటాయించినట్లు మంత్రి తలసాని వివరించారు. శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, నరేందర్, శేఖర్, సలీంఖాన్, నవాబ్, మక్బూల్, అబ్బాస్ వాహిద్ పాల్గొన్నారు.



ముస్లిం ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి

ఘనంగా అమ్మవారి ఘటం ఊరేగింపు



బన్సీలాల్‌పేట్: చరిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 25వ తేదీ ఆదివారం అమ్మవారి ఘటం ఎదుర్కోళ్లతో లష్కర్ బోనాల ఉత్సవాలకు అంకురార్పణ జరిగినట్లయింది. సికింద్రాబాద్ బుద్ధభవన్ ఎదురుగా ఉన్న అమ్మవారి దేవాలయంలో మహంకాళమ్మ ఘటాన్ని ముస్తాబు చేశారు. డప్పుచప్పుళ్ల బ్యాండ్ మేళాల నడుమ పోతరాజుల నృత్యాల మధ్య అమ్మవారి ఘటాన్ని పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. జీరా ఇందిరానగర్ నుంచి ప్రారంభమైన అమ్మవారి ఘటం ఎదుర్కోళ్లు కర్బలామైదాన్ చౌరస్తా, డిస్టలరీ రోడ్డు, రాణిగంజ్, పాన్‌బజార్ సుభాష్ రోడ్డు గుండా మహంకాళి దేవాలయానికి చేరుకుంది. అమ్మవారి ఘటం ఊరేగింపు సికింద్రాబాద్ పురవీధుల్లో కోలాహలంగా సాగింది.

అందంగా అలంకరించి..

సికింద్రాబాద్ మహంకాళమ్మ దేవాలయం అమ్మవారి ఘటాన్ని వెదురుబద్దలతో తయారు చేసి చుట్టూ వేపాకులు, పువ్వులతో అందంగా ముస్తాబు చేశారు. ఆచారం ప్రకారం ప్రతి ఏటా కర్బలామైదానం సమీపంలోని అమ్మవారి దేవాలయం వద్ద అమ్మవారి ఘటాన్ని ముస్తాబు చేసి దేవాలయానికి తీసుకువస్తారు. అనేక మంది వెంట రాగా బ్యాండ్ మేళాలతో అత్యంత వైభవంగా అమ్మవారి ఘటాన్ని ఊరేగించారు. అమ్మవారి ఘటాన్ని ప్రతి రోజు వివిధ ప్రాంతాల్లో భక్తుల సందర్శనార్థం ఊరేగిస్తారు. రాణిగంజ్, పాన్‌బజార్ ప్రాంతాల్లో అమ్మవారి ఘటానికి ఆదివారం రాత్రి వివిధ పార్టీలకు నాయకులు ఘన స్వాగతం పలికారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



అడ్డగుట్ట: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ అన్నారు. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన అంజనేయులు గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు.కుటుంబ సభ్యుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్ అంజనేయులు ఆరోగ్య పరిస్థితిని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. లక్ష మంజూరు చేయించారు. ఆదివారం కార్పొరేటర్ లింగాని ప్రసన్న మంజూరైనా పత్రాలను బాధితుడి భార్య పుష్పకు అందించారు.

సందడిగా గోరింటాకు పండగ



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

లాలాపేట: ఆషాఢమాసంలో మహిళలు ఉత్సాహంగా గోరింటాకు పండగను జరుపుకుంటారని రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ లక్కరాజు నిర్మల అన్నారు. ఈ మేరకు ఆదివారం తార్నాకలో ఆత్మీయ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గోరింటాకు పండుగలో స్థానిక మహిళలు పాల్గొని పాటలు పాడుతూ సందడి చేశారు. సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన ఈ పండగను గత 35 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సులోచన, సుధ, లక్ష్మీ, విద్య, సుప్రియ, పద్మ, వీణ, భవాని పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ (జేఆర్) ఎల్లేష్ గొప్ప మానవతావాది అని పలువురు విద్యార్థి నేతలు, అధ్యాపకులు, ఉద్యోగులు కొనియాడారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ స్పోర్ట్స్ లాంజ్‌లో ఏర్పాటు చేసిన ఎల్లేష్ జన్మదిన వేడుకల్లో కేక్‌కట్ చేసి ఘనంగా సన్మానించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బొల్లారం సమీపంలో చోటు చేసుకుంది. రైలు పట్టాలపై శవాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మరణించిన ఫజియోద్దీన్ సెల్ ఫోన్ ద్వారా వివరాలు సేకరించారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఫజియోద్దీన్ ఇళ్ల కొనుగోలు, అమ్మకం విషయంలో జరిగిన రూ.50 లక్షల మోసాన్ని భరించలేక ఈ నెల 24న అన్న వద్దకు వెళ్తున్నానని ఇంట్లో భార్యకు చెప్పి మరునాడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

లష్కర్ బోనాలకు ఘనంగా ఏర్పాట్లు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



భూమిపూజలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: తెలంగాణ సంస్కృతి.. సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ మహంకాళమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం తరపున విస్తతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్ గాస్‌మండిలోని 18 ఆలయాల్లో ముత్యాలమ్మ అమ్మవారికి సాక సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గాస్‌మండి ప్రాంతంలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజాది కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, నాయకుల ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్, జయరాజ్, రాములు, ప్రమోద్, శ్రీకాంత్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

- బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ డాన్‌బోస్కో స్కూల్ సమీపంలోని ఏడుపాయల కనకదుర్గమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులకు మంత్రి తలసాని స్థానిక కార్పొరేటర్ కె. హేమలతతో కలిసి భూమి పూజ చేశారు. మంత్రి తన వ్యక్తిగత నిధులతో ఈ దేవాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్ గౌడ్, ఎల్ వెంకటేష్, లంకా రాజు, శ్రీనివాస్, వెంకటరమణ, ప్రేమ్, అమృత, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా ఘటోత్సవాలు ప్రారంభం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అదివారం ఉదయం అమ్మవారికి దేవాలయ అనువంశిక ధర్మకర్తలు పసుపు, కుంకుమతో అమ్మవారి ఒడిని ఒడిబియ్యంతో నింపారు. మధ్యాహ్నం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దేవాలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఘటానికి సంబంధించిన ఆభరణాలను దేవాలయ సేవాదారులకు అందించారు.



ఘటోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని పూజలు

- ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆషాఢ జాతరలో భాగంగా ఆదివారం ఉజ్జయినీ మహంకాళి, మాణిక్యాలమ్మ సేవా సమితి అధ్యక్షులు కటారి మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి తొలిబోనం సమర్పించారు. రంగ్రేజీబజార్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి బోనంతో పాటు డప్పుల దరువులు, నృత్యాలు చేస్తూ హాజరయ్యారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు.
- సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ఆధ్వర్యంలో ఆదివారం మహంకాళి దేవాలయం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కరాటే రాజు, అశోక్ చౌదరి, శేకర్ ముదిరాజ్, అశోక్ పాల్గొన్నారు.

వీడనున్న 'గాంధీ డైట్' చిక్కుముడులు

- జిల్లా డైట్ కమిటీ చైర్మన్‌ను బాధ్యతల నుంచి తొలగింపు
- పెంచిన డైట్ ధరలు అమలుకు నోచుకోని వైనం
- వైద్యమంత్రి సీరియస్, తక్షణమే పరిష్కరించమని ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..



గాంధీఆస్పత్రి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్ పేషెంట్లకు ఆహార పదార్థాలు సరఫరా చేసే డైట్ ధరలు ఏడాదిన్నర కాలంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు అవుతున్నా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో పాత ధరలే కొనసాగడం పట్ల వైద్యమంత్రి హరీష్‌రావు ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లాస్థాయి అధికారి ఒకరు చక్రం తిప్పి ఏకపక్షంగా వ్యవహరించడంతో వివాదాలు నెలకొన్నట్లు అంతర్గత విచారణలో తేలడంతో సదరు అధికారిని జిల్లా డైట్ కమిటీ బాధ్యతల నుంచి తప్పించారు. గాంధీ డైట్ వివాదంపై 'సాక్షి' ప్రచురించిన వరుస కథనాలకు స్పందించిన వైద్య మంత్రి పెంచిన డైట్ ధరలు తక్షణం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో గాంధీ డైట్ చిక్కుముడులు వీడుతాయని పలువురు భావిస్తున్నారు. తెలంగాణ వైద్యప్రదాయినీగా పేరుగాంచిన గాంధీ ఆస్పత్రిలో పెంచిన డైట్ ధరలు అమలు కావడంలేదని, నిరుపేదల రోగులకు బలవర్ధకమైన ఆహారం అందడంలేదని సాక్షి ప్రచురించిన పలు కథనాలు వైద్యమంత్రి దృష్టికి వెళ్లాయి. అసలు డైట్ వివాదం ఎందుకు ఏర్పడింది. ఎవరు కారణం, క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని చెప్పడంతో వైద్య ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేపట్టగా, జిల్లా డైట్ కమిటీ చైర్మన్ పేరు వెలుగులోకి వచ్చింది. అన్ని వివాదాలకు అతనే మూలకారణమని, పక్షపాతధోరణిలో వ్యవహరించినట్లు ఆధారాలతో స్పష్టం కావడంతో సదరు అధికారిని జిల్లా డైట్ కమిటీ బాధ్యతలనుంచి తప్పిస్తూ, స్టేట్ డైట్ కమిటీ చైర్మన్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్వేతామహంతికే అదనంగా జిల్లా డైట్ కమిటీ బాధ్యతలు అప్పగిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీముర్తుజా రిజ్వీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యంగా పరిష్కరించి, పెంచిన డైట్ ధరలు అమలు అయ్యేలా ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు గాంధీ ఆస్పత్రికి చెందిన ఓ అధికారి తెలిపారు.

నేడు తార్నాక వార్డు కార్యాలయం ప్రారంభం

లాలాపేట: జీహెచ్ఎంసీ పరిధిలో ఇటీవల నూతనంగా అమలులోకి వచ్చిన వార్డు కార్యాలయాల పాలనకు తార్నాక డివిజన్ వార్డు కార్యాలయం ప్రారంభోత్సవం కానుంది. డివిజన్ పరిధిలో గతంలో నిర్మించిన జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్ భవనం ఇంత కాలం నిరుపయోగంగా మారడంతో అది నేడు వార్డు పాలనా కేంద్రంగా మారింది. శాంతినగర్‌లో గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించి నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ భవనాన్ని ఇటివలే అధికారులు మరమ్మతులు చేపట్టారు. మోడల్ మార్కెట్ పేరు తొలగించి తార్నాక వార్డు కార్యాలయం అని ఏర్పాటు చేశారు. నేడు ఉదయం 9 గంటలకు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

మోడల్ మార్కెట్ కథ కంచికేనా?

తార్నాక మోడల్ మార్కెట్ కథ కంచికి చేరినట్లే. ఏ ఉద్దేశంతో అయితే మోడల్ మార్కెట్ భవనం నిర్మాణం చేశారో అది నెరవేరడం లేదు. ఇక తార్నాక డివిజన్ ప్రజల మోడల్ మార్కెట్ కళ అలాగే మిగిలిపోనుంది. ఇది ఇలా ఉండగా కొందరు లబ్ధిదారులు (మోడల్ మార్కెట్‌లో షట్టర్‌ను దక్కించుకున్నవారు) తమకు జీహెచ్ఎంసీ దుకాణానికి కేటాయించిందని వాటిని యథావిధిగా తమకే అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమైన వార్డు కార్యాలయం



నూతన విద్యార్థి మండలి సభ్యులతో కెప్టెన్ యూనస్, డైరెక్టర్ భాగ్యలక్ష్మి

ఉత్సాహంగా ఇన్వెస్టిచర్ సెర్మనీ

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిల పబ్లిక్ స్కూల్లో ఇన్వెస్టిచర్ సెర్మనీ (నూతన విద్యార్థి మండలి ప్రమాణ స్వీకారోత్సవం) ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా వాయుసేనా మెడల్ గ్రహీత, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎం. యూనస్ హాజరై నూతనంగా ఎన్నికైన హెడ్ బాయ్ శ్రీరామ, హెడ్ గర్ల్ అలీషా, ఇతర క్యాబినెట్ సభ్యులకు బ్యాడ్జీలను ధరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్వెస్టిచర్ సెర్మనీ అనేది విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. భవిష్యత్‌లో దేశానికి మంచి నాయకులుగా ఎదుగుతారని ఆంకాక్షించారు. పాఠశాల డైరెక్టర్ భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ జ్ఞానం, నాయకత్వ సాధనకు ప్రతీకగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ భాను, ప్రిన్సిపాల్ తను ప్రీత్, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్, నాజీమా పాల్గొన్నారు.